నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. తులసీనగర్, చే నంబర్ ఫీడర్ల పరిధిలోని తులసీనగర్, గోల్నాక, చే నంబర్ మెయిన్‌రోడ్, గోల్నాక చర్చి, అశోక్‌నగర్, తిలక్‌నగర్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు... కృష్ణానగర్ ఫీడర్ పరిధిలోని కృష్ణానగర్ , వెంకటేశ్వర్ నగర్, గంగా నగర్, మముక మండి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు... ఇందిరానగర్ ఫీడర్ పరిధిలోని తిలక్‌నగర్ మెయిన్ రోడ్, కృష్ణా నగర్ బ్యాక్ సైడ్, తిలక్ నగర్ బ్రిడ్జ్ తదితర ప్రాంతాల్లో 3.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'ఉద్యోగుల పనితనమే వారికి గుర్తింపు తెస్తుంది'

సుల్తాన్‌బజార్: ఉద్యోగుల పనితనంతోనే గుర్తింపు వస్తుందని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్‌ఓలను డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సమక్షంలో తెలంగాణ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా రవీంద్రనాయక్ మాట్లాడుతూ..... ఉద్యోగులు తమ సర్వీస్‌లో చేసిన సేవలు ప్రజలకు గుర్తుండి పోతాయని అన్నారు. సీహెచ్‌ఓలను ఆత్మీయంగా సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నారు. వారి బెన్‌ఫిట్ కోసం కృషి చేస్తామని తెలిపారు. సీహెచ్‌ఓలు కరుణాకర్ గౌడ్, హసన్ మొహియుద్దీన్, పాషా, మనోహర్‌ను సన్మానించి వారికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు నెహ్రూచంద్ నాయక్, ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జ్ఞానసుందరి, సుధాకర్, సదానందం తదితరుల పాల్గొన్నారు.

బస్తీ దవాఖాన, పీహెచ్‌సీలలో మెరుగైన వైద్యం అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న పీవైఎల్ నాయకులు

ముషీరాబాద్: వర్షాకాలం మూలంగా సీజనల్ వ్యాధులు వ్యాపించడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్ అన్నారు. ఈ మేరకు హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో జె.వెంకటిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... బస్తీ దవాఖానా, పీహెచ్‌సీలలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. దీనిని అదును చూసుకుని ప్రైవేట్ ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నాయని అన్నారు. అనవసరమైన టెస్టులు రాస్తూ, అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా పెట్టి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేని క్లినిక్‌లు సైతం పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయని అన్నారు. ఇలాంటి క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నేతలు ఎం.రవికుమార్, బీఎస్.కృష్ణ, కొల్లూర్ భీమేష్, రాజు, సాయి, ఆంజనేయవులు, నరేష్, రమేష్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక రచయిత క్రొవ్విలి లక్ష్మీనరసింహరావు



లక్ష్మీనరసింహరావుకు నివాళులర్పిస్తున్న కోలేటి దామోదర్‌గుప్తా, జనార్దనామూర్తి

చిక్కడపల్లి: తెలుగు సాహిత్యంలో వేయి పైగా రచనలు చేసిన క్రొవ్విలి లక్ష్మీనరసింహరావు అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోగర్‌గుప్తా అన్నారు. సోమవారం త్యాగారాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికలో ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా క్రొవ్విలి లక్ష్మీనరసింహరావు యాదిలో... పేరిట సంస్మరణ సమావేశంలో ఆయన ముఖ్యతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామోదర్‌గుప్తా మాట్లాడుతూ... తెలుగు నవలా కథా సాహిత్యంలో తొలి రోజుల్లో క్రొవ్విలి అపరాధ పరిశోధక కథలను రాసి తనే ప్రచురణ చేసి అతి తక్కువ ధరకు అమ్మేవారని తెలిపారు. ఆయన తెలుగు సాహిత్యం వ్యాప్తికి ప్రజల్లో పఠనాశక్తి పెంచేందుకు విశేష కృషి చేసిన సాహితీ భీష్ముడని చెప్పారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్దనామూర్తి, జర్నలిస్ట్ జయసూర్య, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, గాయని సీతలు పాల్గొన్నారు.

చిన్నారుల్లో క్రీడలపై ఆసక్తిని పెంచాలి

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ: భవిష్యత్ చాంపియన్లను తీర్చిదిద్దాలంటే చిన్ననాటి నుంచే క్రీడల్లో వారికి ఆసక్తిని కలిగించాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. సోమవారం ఎల్బీస్టేడియంలోని తన కార్యాలయంలో ఫ్యూచర్ ఒలింపియన్ సంస్థ లోగోను ఆవిష్కరించారు.

నింబోలిఅడ్డ మహంకాళి..

శాంతి స్వరూపిణి

• బోనాల జాతరకు ఏర్పాట్లు పూర్తి • ఈనెల 19 నుంచి 21 వరకు వేడుకలు



గర్భాలయంలో కొలువుదీరిన అమ్మవారు

కాచిగూడ: నింబోలిఅడ్డ మహంకాళి అమ్మవారు భక్తుల కోరిన కోర్కెలు తీర్చే శాంతి స్వరూపిణిగా నిత్య పూజలందుకుంటోంది. హైదరాబాద్ నగరంలో ఎంతో ప్రాచుర్యం పొందిన దేవాలయాలలో ఒకటైన నింబోలిఅడ్డ మహంకాళి దేవాలయంలో ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు అమ్మవారి బోనాలు జరుగనున్నాయి. ఇక్కడి అమ్మవారిని పూజిస్తే శాంతి సౌభ్రాతృత్వాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరుస్తాయని భక్తుల విశ్వాసం. దీంతో భక్తులు ఈ అమ్మవారిని ప్రతినిత్యం పూజిస్తుంటారు.

అతి పురాతనమైన ఆలయం..

◆ 244 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయం నింబోలిఅడ్డలోని మహంకాళి ఆలయం. ఈనెల 20వ తేదీన ఆదివారం జరిగే బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మహంకాళి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. నింబోలిఅడ్డలో నివసించే పటేల్ జంగులుగౌడ్ అనే వ్యక్తికి అమ్మవారు కలలో కనపడి తనకు ఆలయం నిర్మించమని ఆదేశించింది. దీంతో పటేల్ జంగులు అమ్మవారి ఆదేశం మేరకు నింబోలిఅడ్డ చౌరస్తాలో మహంకాళి ఆలయం, దర్బారు మైసమ్మ ఆలయాలను నిర్మించారు.

19 నుంచి బోనాల జాతర

◆ తెలంగాణ ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకునే బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని కాచిగూడలోని పలు అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శని, ఆది, సోమవారాల్లో నిర్వహించే ఈ ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఆలయాలకు స్వాగత తోరణాలతో రంగులు వేసి రకరకాల విద్యుద్దీపాలతో అలంకరించారు.

– నింబోలిఅడ్డలోని మహంకాళి ఆలయంలో జూలై 19వ తేదీన సాయంత్రం అమ్మవారి ఘటం ఎదుర్కోళ్ల కార్యక్రమం జరుగుతుందని ఆలయ ధర్మకర్త తెలిపారు. 20వ తేదీన ఉదయం 4గంటల నుంచి అర్ధరాత్రి వరకు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని తెలిపారు. 21వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు పచ్చికుండ, గావుపట్టుట, బలిగంప, రంగం ఎక్కి భవిష్యత్‌వాణిని అమ్మవారు చెబుతారని తెలిపారు. సాయంత్రం 6గంటలకు అమ్మవారి శోభాయాత్రతో బోనాల ఉత్సవాలు ముగుస్తాయని ఆయన పేర్కొన్నారు.



నింబోలిఅడ్డలోని మహంకాళి అమ్మవారి ఆలయ ముఖద్వారం

హాజరుకానున్న ప్రముఖులు

20న జరిగే బోనాల వేడుకలకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నేతలు పాల్గొంటాని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ధర్మకర్త కోరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరం



అంబేడ్కర్ కళాశాలలో జరిగిన ఓరియంటేషన్‌లో మాట్లాడుతున్న ప్రొ. శ్రీనివాసమూర్తి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థుల ఎదుగుదలకు సమాజమే ఒక ప్రయోగశాల అని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ప్రొ. శ్రీనివాసమూర్తి అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో తట్టుకోవాలంటే విద్యార్థులకు నిరంతర శ్రమ, పట్టుదల, కృషి ఎంతో అవసరం అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అటనామస్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొ. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ... విద్యార్థుల తమ లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతర అధ్యయనంతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. కళాశాల సీఈఓ ప్రొ. లింబాద్రి మాట్లాడుతూ... 1973లో దివంగత మాజీ కేంద్ర మంత్రి జి.వెంకటస్వామి బలహీన వర్గాల విద్యార్థుల కోసం అప్పటి భారత రాష్ట్రపతి వీవీ గిరి చేతుల మీదుగా అంబేడ్కర్ విద్యాసంస్థలు స్థాపించారని చెప్పారు. ఇందులో చదివిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పబ్లిక్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశంతో పాటు అనేక మంది ఉన్నతస్థాయికి చేరుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ పీవీ రమణకుమార్, డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపల్ డాక్టర్ మట్టా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'మున్నూరుకాపు ట్రస్ట్' అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేందర్

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు అభివృద్ధికి, మున్నూరుకాపుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని ట్రస్ట్‌బోర్డు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్స్ దడువై రాఘవేందర్ అన్నారు. సోమవారం కాచిగూడలోని కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ బోర్డు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్స్ ఎనుగుల మాణిక్ ప్రభు, మోర సంపత్, ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు, దాతలు ఆకుల పాండురంగరావు, మంద సూర్యప్రకాష్, దడువై రాధకృష్ణ, ఎనుగుల వెంకట్ పాల్గొని మాట్లాడారు. ట్రస్ట్ డీడ్‌కు అనుగుణంగా మున్నూరుకాపు విద్యార్థులకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ట్రస్ట్‌బోర్డుకు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఈఓగా ఎస్.అంజనారెడ్డిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని తెలిపారు. ట్రస్ట్ డీడ్ లక్ష్యాలను అమలు చేయడంతో పాటు సంస్థను రక్షించేందుకు కృషి చేస్తామన్నారు. ట్రస్ట్ బోర్డుకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రావడానికి కృషి చేసిన కుల పెద్దలు, ప్రజా ప్రతినిధులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాంనగర్ గల్లీ నుంచి గవర్నర్ గిరి వరకు..

గవర్నర్ పోస్టు నుంచి దత్తాత్రేయ పదవీ విరమణ



ముషీరాబాద్:హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో కలకత్తాకు చెందిన ప్రొ. అషీమ్‌కుమార్ ఘోష్‌ను భారత రాష్ట్ర గవర్నర్‌గా నియమించారు. బండారు దత్తాత్రేయ 2019సెప్టెంబర్ 11న హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆ తరువాత 2021 జూలై 15న హరియాణా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. 2025 జూలై 14న తన పదవీ కాలం ముగిసినప్పటికీ 9నెలల పాటు దత్తాత్రేయకు పదవీ కాలాన్ని పొడిగించారు. దీంతో దత్తాత్రేయ ఐదేళ్ల 9 నెలల పాటు గవర్నర్‌గా హిమాచల్‌ప్రదేశ్, హరియాణా రాష్ట్రాలకు సేవలను అందించారు. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో కరోనాతో రాష్ట్రం అల్లాడిపోతున్న తరుణంలో ప్రజలకు చేరువై సేవలను అందించారు.హరియాణా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బలోపేతం చేస్తూ విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యతను ఇచ్చారు.

'బీసీ రిజర్వేషన్లపై సవతి తల్లి ప్రేమ'

సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి



కాచిగూడ: బీసీ రిజర్వేషన్ల పట్ల రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపుతోందని సమాజ్‌వాది పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి ఆరోపించారు. కాచిగూడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా బిల్ పాస్ చేస్తూ రాష్ట్రపతికి పంపినప్పటికీ కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదని అన్నారు. ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు బీసీ రిజర్వేషన్లపై ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. జనాభాలో 60 శాతంగా ఉన్న బీసీలు గత 7 దశాబ్దాలుగా అధికారానికి దూరంగా ఉంటూ వెలివేయబడుతున్నారని అన్నారు. రాజ్యాంగం ఎలాంటి సీలింగ్‌ను విధించనప్పటికీ కోర్టు తీర్పులతో 50శాతం సీలింగ్ ప్రక్రియ మొదలైందని ఆయన పేర్కొన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను పార్లమెంట్‌లో తీర్మానం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్పితేనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బీసీలకు సరైన ప్రాతినిధ్యం కల్పిస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్ కోకటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఘటం ఊరేగింపు



ఘటం ఊరేగింపులో పాల్గొన్న బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు

ముషీరాబాద్: ముషీరాబాద్ మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపును భక్తిశ్రద్ధలతో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ జలమండలి కార్యాలయం ఆవరణలోని అమ్మవారి దేవాలయం నుంచి ఘటాన్ని ఎత్తుకుని ఊరేగింపుగా ముషీరాబాద్ మహంకాళి దేవాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధానార్చకుడు వై.చంద్రమౌళి, ఈవో మహేందర్‌కుమార్ ఘటానికి పూజలు చేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనెల 21వ తేదీ వరకు అమ్మవారి ఘటాన్ని ఆలయ పుర వీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల హరిబాబుయాదవ్, డి.శివముదిరాజ్, శ్రీధరాచారి, అభినందన్ యాదవ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, బీజేపీ నేత జమాల్‌పురి నందు, కాంగ్రెస్ నేత నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆఖరికి చెట్ల కొమ్మలు తరలించారు



సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..



చెట్ల కొమ్మలను తరలించిన తర్వాత సోమవారం రామాలయం వీధి ఇలా..

నల్లకుంట: పది రోజుల క్రితం న్యూనల్లకుంట న్యూ రామాలయం వద్ద ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు అల్లుకుపోతున్న మూడు భారీ వృక్షాల కొమ్మలను తొలగించారు. తొలగించిన చెట్ల కొమ్మలను అక్కడి నుంచి తలించడంలో పారిశుధ్య సిబ్బంది అలసత్వాన్ని ప్రదర్శించారు. రోజుల తరబడి చెట్ల కొమ్మలు వీధిలో ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న స్థానికులు ఈ సమస్యను స్థానిక కార్పొరేటర్ అమృత దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ గత మంగళవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. వీధిలో పెద్ద ఎత్తున చెట్ల కొమ్మలు పేరుకుపోయి ఉండడాన్ని గమనించిన కార్పొరేటర్ వెంటనే పారిశుద్ధ్య విభాగం ఎఫ్ఎస్ఏలను అక్కడికి రప్పించి ఆలయ ప్రహరీ పక్కన పేరుకుపోయిన చెట్ల కొమ్మలను తొలగించాలని ఆదేశించారు. ఆ సమయంలో సరేనని చెప్పిన పారిశుద్ధ్య సిబ్బంది ఆ తర్వాత పట్టించుకోలేదు. దీంతో విసిగిపోయిన స్థానికులు సమస్యను 'సాక్షి'దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై 'తొలగించిన చెట్ల కొమ్మలు తరలించరా?'అనే శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. వీధి పక్కన కుప్పలుగా వేసిన చెట్ల కొమ్మలను వెంటనే అక్కడి నుంచి తరలించారు.

టీబీఎస్ఎస్ ప్రతినిధి రామరాజు శ్రీనివాసరావు మృతి



(ఫైల్)

నల్లకుంట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధి రామరాజు శ్రీనివాసరావు(58) ఆదివారం రాత్రి 11గంటల సమయంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య ఓ కుమారుడు ఉన్నారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ప్రతినిధులు దేవులపల్లి రంగారావు, శ్యామసుందర్ రావు, ప్రముఖ పాత్రికేయుడు, తేజోప్రభ సంపాదకుడు వెంకటప్రభాకర్ రావు తదితరులు సోమవారం మృతుడి నివాసానికి వెళ్లారు. మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో చాలా మంది బ్రాహ్మణ ప్రముఖులు వరసగా మృతి చెందుతున్నారని అన్నారు. ఇది బ్రాహ్మణ సమాజానికి తీరని లోటని అన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు



నల్లకుంట: సంకటహర చతుర్థిని పురస్కరించుకొని సోమవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని గణపతి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఈ సందర్భంగా న్యూనల్లకుంటలోని న్యూ రామాలయం, బ్రాహ్మణ హాస్టల్ సమీపంలోని లక్ష్మీగణపతి ఆలయం, టీఆర్టీ కాలనీలోని విజయ గణపతి ఆలయం, డీడీ కాలనీలోని లక్ష్మీగణపతి ఆలయంలో గణనాథుడికి ప్రత్యేక అభిషేకాలు, గరిక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు అర్చక స్వాములు తీర్థప్రసాద వితరణ చేశారు.

గురువులకు సంగీత కళాభారతి పురస్కారాలు

సుల్తాన్‌బజార్: గురువులచే నేర్చుకున్న కళలు భవిష్యత్‌ను ఇస్తాయని స్వరభారతి అధ్యక్షుడు గాడేపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్వరభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురువుల వద్ద సంగీతం నేర్చుకున్న శిష్యులు తమ గురువులను సత్కరించుకున్నారు. గురువుల వద్ద అభ్యసించిన సంగీతంతో గురు పరంపరకు సంబంధించిన శ్లోకాలు, గీతాలు పాడి వారి గురు భక్తిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్వరభారతి ఫౌండేషన్ గురువులైన పద్మావతి, శారద, రేవతి, ఇందిరా, సుబ్రమాణ్యం తదితరులకు సంగీత కళాభారతి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కొడాలి వెంకటేశ్వర్‌రావు, సుబ్రమాణ్యం, హరికృష్ణ, రాధాకుమారి, గడిపల్లి సంధ్య, ప్రసన్న, దివ్య తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంట పునరుద్ధరణతో ఇబ్బందులు తలెత్తొద్దు



బతుకమ్మకుంట పరిసరాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: బతుకమ్మకుంట పునరుద్ధరణతో పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, అధికారులతో కలిసి పరిసర ప్రాంతాలైన వైభవ్‌నగర్, వీకర్ సెక్షన్, సాయినగర్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రధానంగా బతుకమ్మకుంట పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపునీటి సమస్య రాకుండా ముందుస్తూ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. కుంటతో సమీప ప్రాంతాలు ముంపునకు గురికాకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే కుంట మొత్తం నిండితే అందులో నీరు జనవాసాల్లోకి వెళ్లకుండా ప్రణాళికబద్ధంగా ఏమి చర్యలు తీసుకుంటారో తీసుకోండని అన్నారు. నాలాలు, డ్రైనేజీ వ్యవస్థలను ఇప్పుడే అభివృద్ధి చేయాలని సూచించారు. చుట్టు ఫెన్సింగ్, పచ్చదనం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రశాంతి, జలమండలి మేనేజర్ మజీద్ ఇతర అధికారులు, బీఆర్ఎస్ నాయకులు చందు, శ్రీరాములు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి.. అభివృద్ధికి సహకరించండి

జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులను కోరిన కార్పొరేటర్ పావని



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: అభివృద్ధి పనుల విషయంలో వివిధ విభాగాల ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి డివిజన్ అభివృద్ధి సహకరించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని సూచించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలల్లో చేపట్టిన సీవరేజీ, మంచినీటి పైపలైన్ నిర్మాణ పనులపై సోమవారం అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీవరేజీ, మంచినీటి పైపలైన్ నిర్మాణం సందర్భంగా రోడ్డు కటింగ్ చేయాల్సి వస్తుందని అదికారులు తెలిపారు. రోడ్డు కటింగ్ పర్మిషన్ తీసుకోలేదంటూ జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఫిర్యాదు చేస్తున్న నేపథ్యంలో సమన్వయంతో పని చేయాలని కోరారు. అభివృద్ధిలో అధికారులు కూడా భాగస్వాములు కావాలని ఆటంకాలు సృష్టించవద్దని అన్నారు. ఈ సమావేశంలో వాటర్‌బోర్డు డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణ మోహన్, ఇంజినీరింగ్ విభాగం ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



నల్లపోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: బోనాల ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ వినోభా కాలనీలో నల్లపోచమ్మ దేవాలయ బోనాల ఉత్సవాల అలంకరణ పూజా కార్యక్రమాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తలారి శ్రీకాంత్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యుత్ శాఖ, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, దీన్‌దయాల్‌రెడ్డి, వాణిజ్య విభాగం డివిజన్ అధ్యక్షుడు టెంట్‌హౌస్ శ్రీనివాస్, ఎయిర్‌టెల్ రాజు, సురేష్‌కుమార్, సదా, అనిల్, సత్యనారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సహాయ పరికరాలు ఇస్తాం



దివ్యాంగులకు ఉచితంగా అందజేసే సహాయ పరికరాల పంపిణీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

ముషీరాబాద్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగులకు సహాయ పరికరాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు మహంకాళీ జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ తెలిపారు. సోమవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా దివ్యాంగుల సహాయ పరికాల పంపిణీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈనెల 16వ తేదీన తాళ్లబస్తీ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు దివ్యాంగులను ఎంపిక చేస్తామన్నారు. 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులను ఎంపిక చేసి వారికి కావాల్సిన వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలు, కృత్రిమ కాళ్లు, చేతులు, అంధులకు మొబైల్ ఫోన్‌లు, చేతికర్రలు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. వృద్ధులకు సైతం కావాల్సిన సహాయ పరికరాలను అందజేస్తామని పేర్కొన్నారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, మూడు పాస్‌ఫోర్టు సైజ్ ఫొటోలు ఎంపిక చేసే శిబిరానికి తీసుకురావాలని అన్నారు. ఈ సమావేశంలో కొల్లి నాగేశ్వర్ రావు, పూస రాజు, బిజ్జి కనకేష్, రాంరెడ్డి, సదానంద్, శేషసాయి, మహేష్‌కుమార్, నవీన్‌గౌడ్, నందగిరి నర్సింహ్మా, చంద్రమోహన్, వినయ్‌కుమార్, కంచి ముదిరాజ్, రాజశేఖర్, సాయికృష్ణయాదవ్, సురేష్ కుమార్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.